క్లుప్తంగా

ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి దంపతులు

పుల్లంపేట: మండల పరిధిలోని వత్తలూరు గ్రామ పంచాయతీలో వెలసివున్న ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, ఆయన సతీమణి ముద్దా విజయమ్మలు రూ. లక్ష గ్రామ పెద్దలకు శనివారం అందజేశారు. జూన్ నెల 2వ తేదీ నుంచి ఎల్లమ్మతల్లి తిరుణాల వైభవంగా జరగనుందని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏడాదికి ఒకసారి జరిగే ఎల్లమ్మతల్లి తిరుణాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకోనున్నారు.

వైఎస్ఆర్ పశుబీమా వినియోగించుకోవాలి

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ పశుబీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ గణేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఉత్పాదక ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు ఏవైనా మరణించినట్లయితే వాటికి బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఆవులు 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు, గేదెలు 3 నుంచి 12 సంవత్సరాల వయసు, ఎద్దులు 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. గొర్రెలు, మేకలు, పందులు 6 నెలలు లేదా ఎక్కువ వయస్సు ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా రైస్‌కార్డ్ ఉన్న రైతు సోదరులకు రూ.30 వేల బీమా కోసం రూ.384 చెల్లించినట్లయితే 3 సంవత్సరాల బీమా వర్తిస్తుందన్నారు. అదే పశువుకి రూ.30 వేల కంటే ఎక్కువగా బీమా చేయించుకోవాలంటే మిగిలిన అమౌంట్‌కు 6.4 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విధంగా రైతులు తమ మేలు జాతి పశువులకు రూ.1.20 లక్షల వరకు బీమా చేసుకోవచ్చన్నారు. ఈ పథకం పాడి రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో తమ ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, మొబైల్ నెంబర్ వారి పశువుల వివరాలను తెలిపి నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

సమష్టి కృషితో కాలుష్యాన్ని నివారిద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో కాలుష్యాన్ని నివారిద్దామని ఎంపీఐ విజయకుమారి అన్నారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్ సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు విధిగా తమ వాహనాన్ని స్విచ్ ఆఫ్ చేయాలని కోరారు. తద్వారా కాలుష్యాన్ని నియంత్రించడం తోపాటు ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లికార్జున, ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముదివేడు రిజర్వాయర్ వద్ద రైతు సభ

కురబలకోట : మండలంలోని పిచ్చలవాండ్లపల్లె గ్రామం ముదివేడు రిజర్వాయర్ వద్ద ఆదివారం ఉదయం పది గంటలకు రిజర్వాయర్‌కు సంబంధించి రైతులతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో నిర్వహిస్తున్న సభకు నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరుకావాల్సిందిగా కోరారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

మదనపల్లె సిటీ : వైఎస్సార్ కడప జిల్లాలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 4,5 తరగతుల్లో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్డీఓ షేక్ షఫీ తెలిపారు. వచ్చే నెల 15 నుంచి 20 వరకు మండల స్థాయిలోను, 22 నుంచి 26వతేదీ వరకు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని 29,30 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామన్నారు. 4వతరగతిలో ప్రవేశానికి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు, 5వతరగతిలో ప్రవేశాలకు 9 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు స్థాని క న్యాయమూర్తి ఉమర్‌ఫారుఖ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను స్థానిక కోర్టులో తీసుకుని పూర్తిచేసిన వాటిని మండల న్యాయసేవాసంఘం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అందజేయాలని తెలిపారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ఓబులవారిపల్లె : సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రామాపురం: ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మంగళంపల్లె ఎస్టీ కాలనీలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. విద్యుత్, రేషన్ కార్డులు, రోడ్ల సమస్యలు ప్రజలు ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకొని వచ్చారు. వెంటనే ఆయన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, నిరంతరంగా కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు, యల్లాయపల్లె సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, తహసీల్దార్ పీర్ మున్ని, ఎంపీడీఓ విజయారావు, స్థానిక నాయకుడు సుధాకర్‌నాయుడు, ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన..

ఇటీవల వడగండ్ల వానకు బోటిమీదపల్లె గ్రామంలో దెబ్బతిన్న పండ్ల తోటలను శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పైడి గిరినాయుడుకు చెందిన దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలించారు. నియోజకవర్గంలో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌తో చర్చించామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

జన సంక్షేమమే జగనన్న సంకల్పం

రామాపురం : జన సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిట్లూరు గ్రామంలో ఉదయం 6 గంటలకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని పక్కీరుపల్లె, పాలన్నగారిపల్లె, ఏకిలపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ , సమస్యలను ఆరా తీసి వాటి పరిష్కారానికి చొరవచూపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సుఖసంతోషాలే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గడప గడపలో నీరాజనం..

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాకతో చిట్లూరు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా సంతృప్త స్థాయిలో తమ గడప వద్దకే చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజానీకం నిండు మనస్సుతో ఆశీర్వదించింది. పింఛన్ల నుండి ఫీజుల దాకా...ఇళ్ల పట్టాల నుండి అమ్మ ఒడి వరకు నాలుగేళ్లలో 99 శాతం హామీలను నెరవేర్చి ప్రజల చెంతకు చేరుకోవడంపై హర్షతిరేకాలు వ్యక్తం చేశారు.

■ ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఏఓ నాగమణి, హార్టికల్చర్ అధికారిణి నాగమణి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ రామాంజులు, మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ చిన్న నరసింహులు, మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారెడ్డి, ఆదిరెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సర్పంచులు నాగభూషన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఆంజనేయులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, హస్తకళల డైరెక్టర్ హంశేన్, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సంబేపల్లె : మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ఉన్నందున పిల్లలను చెరువులు, బావులు, వంకల సమీపంలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సెలవులకు ఊరు వెళ్లే వారు తమ విలువైన వస్తువులు, నగదును జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

వీరబల్లె (రాయచోటిటౌన్) : చిన్న పిల్లల పట్ల తల్లి దండ్రులు జాగ్రత్త వహించాలని వీరబల్లె ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. శనివారం ఆయన వీరబల్లె ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు (చిన్న పిల్లలు) చెరువులు, కుంటలు, బావులు, వాగులలో ఈత కొట్టడానికి వెళుతుంటారని, అలాంటి వాటిలో ఈత రాని వారు, లోతైన వాగులలో ఊబి ఎక్కువగా ఉండటంతో ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోతుంటారని చెప్పారు. అలాగే ఇళ్లను వదిలి బంధువుల ఇళ్లకు వెళ్తున్న సందర్భంలో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు తమతో తీసుకెళ్లాలని చెప్పారు. అలాగే చిన్న పిల్లలకు స్కూటర్లు ఇవ్వరాదని హెచ్చరించారు.

నేడు క్రికెట్ ఫైనల్ మ్యాచ్

నందలూరు (రాజంపేట) : నందలూరు క్రీడామైదానంలో ఎన్‌పీఎల్ 7వ సీజన్ 20–20 క్రికెట్ మెగా ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నేత పల్లె గ్రీష్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సికిందర్ లెవన్స్ నందలూరు, గోపి లెవన్స్ వెంకటరాజంపేట జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ కొనసాగనున్నది. సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



పెద్దాసుపత్రి సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : రాజంపేటలోని వందపడకల ఏరియా ఆసుపత్రి (రాజంపేట పెద్దాసుపత్రి)లో మెరుగైన వైద్యసేవలందించాలని శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ, వైద్యులతో ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులపట్ల ఆప్యాయత, ప్రేమాభిమానాలు చూపి చికిత్స అందించాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో అనేక కారణాలతో వచ్చే పేదరోగులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. వందపడకల ఆసుపత్రి అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న సర్కారు హయాంలో ఆసుపత్రి నూతనశోభను సంతరించుకుందన్నారు. నూతన భవన నిర్మాణాలు, ఆధునిక సౌకర్యాలు కల్పన దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న అన్నింటినీ సకాలంలో పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆసుపత్రి సమస్యలను వైద్యసిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటన్నింటిపై సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేసే అంశంపై దృష్టిసారించామన్నారు. రోగులకు భోజనాలు పెట్టే విషయం పరిష్కరిస్తామన్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజు, హెచ్‌డీసీ డైరెక్టరు ఉమామహేశ్వరరెడ్డి, వడ్డె శ్రీను, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ ఆదర్శం



నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయ వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు (రాజంపేట): సచివాలయంలో వలంటీర్ల వ్యవస్థ ఆదర్శమని ఎ ండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయం పరిధిలోని వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే అందులో కీలకం వలంటీర్లు అనేది ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. నాగిరెడ్డిపల్లె సచివాలయం తుపాకుల శిరీషకి సేవారత్న అవార్డు రావడంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, బీసీ నాయకుడు తుమ్మల శ్రీధర్‌గౌడ్, ఎంపీటీసీ సుభాన్, సర్పంచి మోడపోతుల సుభాషిణి రాము, ఈవోఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలో రూ. 32 లక్షలతో సీసీరోడ్డు పనులకు, అండర్ డ్రైనేజి పైపు లైన్ పనులను శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేశారు. గత వారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీకి కట్టుబడి గ్రామ పంచాయతీ నుంచి రూ.12 లక్షలు, సచివాలయం నుంచి రూ.20 లక్షల వ్యయంతో లక్ష్మీనగర్, పగడాలపల్లెలో సిమెంట్ రోడ్డు, అండర్ డ్రైనేజ్ పైప్ లైన్లకు భూమి పూజ చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ హయాంలో కోడూరు పట్టణం అభివృద్ధి జరగలేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం కోడూరు పట్టణంలోనే రూ.4.5 కోట్లతో సీసీరోడ్డు పనులు చేశామన్నారు. రాష్ట్రంలో ఎటువంటి వివక్ష లేకుండా, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ కన్వీనర్ సిహెచ్.రమేష్, గునిశెట్టి రమేష్, బండారు మల్లి, జనార్దన్‌రాజు, రౌఫ్, సుబ్రమణ్యం, వార్డు మెంబర్ ప్రియాంక, నాగరాజా, వైఎస్ కరీముల్లా, మొహమ్మద్, రత్తయ్య, మారెల్ల చందు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలకు నిరసనగా 29న బైక్ ర్యాలీ

మైదుకూరు : చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసినందుకు నిరసనగా సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరులో శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని, బ్యాంకుల్లో రైతుల బంగారును తాకట్టు నుంచి విడిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీలను నెరవేర్చకుండా మహిళలను, రైతులను చంద్రబాబు మోసగించారని ఆరోపించారు. పాత మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చని చంద్రబాబు తాజాగా మహానాడులో కొత్త మేనిఫెస్టోను విడదల చేయడం శోచనీయమన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరుతూ, చంద్రబాబు ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా ఈ బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. సోమవారం ఉదయం దువ్వూరు సమీపంలోని కోదండ రామాలయం వద్ద నుంచి సుమారు 400 మందితో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఖాజీపేటలోని బంగ్లా వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మైదుకూరు, దువ్వూరు, చాపాడు ఎంపీపీలు థామస్, జయచంద్రారెడ్డి, లక్షుమయ్య, మైదుకూరు వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మూలె సుధాకర్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, గల్లా నరసింహారెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

వీసీ ఆకస్మిక తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ శనివారం విశ్వవిద్యాలయంలోని పలుశాఖలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిపాలన భవనంలోని ఎస్టాబ్లిష్‌మెంట్, అకడమిక్, ఫైనాన్స్, డెవలప్‌మెంట్ విభాగాలను, లీగల్‌సెల్‌ను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, వారి విధులకు సంబంధించిన రికార్డులను, ఈ ఫైలింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ కర్తవ్య దీక్షతో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. రికార్డులు ఏరోజుకారోజు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం పరీక్షల నియంత్రణాధికారి విభాగాన్ని పరిశీలించారు. డీకోడ్ అయిన పరీక్షల సమాధాన పత్రాలను పరిశీలించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఉన్నారు.

మోసగాళ్ల కోసం కర్ణాటక పోలీసుల గాలింపు

పీలేరు : ఎర్రచందనం మొక్కల పేరుతో చీటింగ్‌కు పాల్పడిన మొక్కల వ్యాపారుల ముఠా కోసం కర్ణాటక పోలీసులు పీలేరులో గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలిలావున్నాయి. శనివారం పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పీలేరుకు చెందిన కొందరు మొక్కలు వ్యాపారులు ముఠాగా ఏర్పడి ఒరిస్సా, ఛతీష్‌గడ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎర్రచందనం మొక్కలు విక్రయిస్తూ రైతుకు మొక్కలు నాటితే పెన్షింగ్, బోరు, మెయింటెనెన్స్‌కింద రుణం మంజూరవుతుందని నమ్మబలికి లక్షలాది రూపాయలు అడ్వాన్సుగా తీసుకుని ఉడాయించినట్లు పలు ప్రాంతాల్లో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. గత ఏడాది కూడా ఛతీష్‌ఘడ్‌లో చీటింగ్‌కు పాల్పడి అరెస్ట్ అయిన విషయం విదితమే. అదే ముఠా కర్ణాటక రాష్ట్రం గుల్బార్గాలో రైతుల వద్ద రూ.45 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో అక్కడ ఫిర్యాదులు అందుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సచివాలయాలను పరిశీలించిన స్టేట్ స్పెషల్ ఆఫీసర్

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం, కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను శనివారం గ్రామ, వార్డు సచివాలయాల స్టేట్ స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ సందర్శించారు. సచివాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. సచివాలయాల పనితీరు, ఆర్థిక నిర్వహణ, పథకాల అమలుపై సిబ్బందితో ఆయన మాట్లాడారు. కొత్తపల్లె పంచాయతీలోని సచివాలయాల పనితీరు బాగుందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా కొత్తపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ సచివాలయ స్టేషనరీ, విద్యుత్ బిల్లులు ప్రతి నెలా గ్రామ పంచాయతీలే భరిస్తున్నాయని తెలిపారు. సచివాలయాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించాలని స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని తమ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పెషల్ ఆఫీసర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం : ప్రభుత్వ, ప్రైవేట్ పాల్‌టెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిప్లమో పూరైన విద్యార్థులకు ఇండస్ట్రియల్‌లో రూ.9 వేల స్టైఫండ్‌తో ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చి పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగం చూపించే అవకాశం ఉందన్నారు. అలాగే సంస్థలలో శిక్షణ పూరైన తర్వాత ఐఏఎస్ స్టాండ్ కలిగిన సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని డిప్లమో పూరైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీటు వచ్చిన వారికి హాస్టల్ వసతిని విద్యార్థినులకు పులివెందులలో, విద్యార్థులకు క్యాంపస్‌లో కల్పిస్తారన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.40 కోట్ల పాడా నిధులతో విలువైన మిషనరీస్‌తోపాటు ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో ఎల్లమ్మతల్లి జాతర శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడ్డి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొనేని కృష్ణయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ యువనాయకుడు సుబ్బా నాయుడు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఎల్లమ్మతల్లిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి ఆసాదికథ నిర్వహించారు. ఆదివారం ఉదయం పొంగళ్ల కార్యక్రమం ఉందన్నారు. వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించే ముందు ఆదివారం ఎల్లమ్మ జాతర చేయడం ఆనవాయితీ.

ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లె గ్రామంలో వెలిసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పలు పూజాది క్రతువులను నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు వెంకట నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం రోడ్డు మార్గంలోని గద్దగుండ్లరాచపల్లి సమీపంలోని నామాల గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం తోపాటు అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వెంకయ్య స్వామికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో వెంకయ్య స్వామి ఆలయంలో శనివారం భక్తులు ఘనంగా పూజలు చేసారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే స్థానిక వెంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలస్వామి

పెనగలూరు : పెనగలూరులోవెలసివున్న పురాతనకాలం నాటి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముందు శనివారం వేణుగోపాలస్వామిని వేదపండితులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీ. వేణుగోపాలస్వామికి నిర్వహించిన పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసియున్న శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆన్‌లైన్ మోసాల వలలో పడొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాష

రాయచోటి టౌన్ : ఇప్పుడు అనేక ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు ఆ వలలో పడరాదని రాయచోటి డీఎస్పీ ఎస్ మహబూబ్‌బాష అన్నారు. శనివారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ఎక్కడి నుంచో ఫోన్ చేయడం డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో రెండింతలు అవుతుందని నమ్మబలికి మోసం చేస్తున్నారని చెప్పారు. అలాంటి మోసపూరిత ఫోన్‌లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. వేసవి కాలం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నారులు వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిస కాకూడదని హెచ్చరించారు. పెద్దల పట్ల గౌరవంతో మెలగాలని చెప్పారు. ఇతర ఊర్లకు వెళ్లేటప్పుడు ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులు జాగ్రత్తగా బ్యాంక్‌లలో ఉంచాలని లేదా తమతో తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించండి

పెద్దతిప్పసముద్రం : మండల ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా వారికి అవగాహన కల్పించాలని ఎస్ఐ రవీంద్రబాబు సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులతో సమీక్షించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ గారడీ మాటలకు, నకిలీ వెబ్‌సైట్‌లకు గ్రామీణ ప్రాంత అమాయకులే కాక చదువుకున్న విద్యావంతులు సైతం మోసపోతున్నారన్నారు. ఆన్‌లైన్ మోసగాళ్ళ నుంచి ఫోన్‌ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా వచ్చే సందేశాలకు ఆకర్షితులై చివరకు మోసపోయామని గ్రహించి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్నారన్నారు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగం అని, ఇంట్లో నుంచి మొబైల్ ద్వారానే ఉద్యోగం చేస్తే నెలకు ఐదంకెల జీతం అని నమ్మించడం, లక్కీ డ్రాలో మీ నంబర్ ఎంపికైంది, రూ.16 వేల విలువ చేసే మొబైల్‌ను రూ.4 వేలకే ఇస్తామని ఇలాంటి మాయమాటలతో ప్రజల వివరాలు సేకరించి గుట్టుగా వారి ఖాతాల్లోని నగదును కాజేస్తున్నారన్నారు.